# యోనా ప్రవచనం

### యోనా యెహోవా నుండి పారిపోవుట

1 యెహోవా వాక్కు అమిత్తయి కుమారుడైన యోనాకు వచ్చింది:
2 "నీవు లేచి నీనెవె మహా పట్టణానికి వెళ్ళి దానికి వ్యతిరేకంగా
ప్రకటించు, ఎందుకంటే దాని చెడుతనం నా దృష్టిలో ఘోరంగా ఉంది."
3 అయితే యోనా యెహోవా సన్నిధి నుండి పారిపోదామని తర్షీషు
వైపు వెళ్లాడు. అతడు యొప్పేకు వెళ్ళి అక్కడ తర్షీషుకు వెళ్లే ఓడను
చూశాడు. అతడు డబ్బు చెల్లించి, యెహోవా నుండి పారిపోవడానికి
ఓడ ఎక్కి తర్షీషుకు ప్రయాణమయ్యాడు.
4 అప్పుడు యెహోవా సముద్రం మీద పెనుగాలిని పంపగా బలమైన
తుఫాను లేచింది, అది ఓడను బద్దలు చేసేంత భయంకరంగా ఉంది.
5 ఆ నావికులందరు భయపడ్డారు, ప్రతివాడు తన దేవునికి
మొరపెట్టాడు. ఓడ తేలిక చేయడానికి దానిలో ఉన్న సరుకులు
సముద్రంలో పారవేశారు.
అయితే యోనా ఓడ దిగువ భాగానికి వెళ్లి పడుకుని గాఢ నిద్రలోకి
వెళ్లాడు.
6 ఓడ నాయకుడు అతని దగ్గరకు వెళ్లి, "నీవు ఎలా
పడుకోగలుగుతున్నావు? లేచి నీ దేవునికి మొరపెట్టు! ఒకవేళ
ఆయన మనల్ని గమనించి మనం నశించకుండా చేస్తారేమో" అని
అన్నాడు.
7 అప్పుడు నావికులు, "రండి, ఎవరి మూలంగా ఈ ఆపద
రాడానికి ఎవరు బాధ్యులో చీట్లు వేసి తెలుసుకుందాం" అని ఒకరితో
ఒకరు అనుకున్నారు. వారు చీట్లు వేసినప్పుడు చీటి యోనా పేరిట
వచ్చింది.

8 కాబట్టి వారు అతన్ని, “చెప్పు, ఈ కష్టం మన మీదికి రావడానికి
ఎవరు బాధ్యులు? నీవు ఏ పని చేస్తావు? నీవు ఎక్కడ నుండి
వచ్చావు? నీ దేశం ఏది? నీ జనమేది?” అని అడిగారు.

9 అందుకతడు, “నేను హెబ్రీయున్ని; సముద్రాన్ని ఎండిన నేలను
సృజించిన పరలోక దేవుడైన యెహోవాను ఆరాధిస్తాను” అన్నాడు.

10 దానికి వారు భయపడి అతనితో, “నీవు చేసింది ఏంటి?”
అన్నారు. (అతడు యెహోవా నుండి పారిపోతున్నాడని వారికి
తెలుసు, ఎందుకంటే అతడు అప్పటికే వారికి చెప్పాడు.)

11 సముద్రంలో తుఫాను మరీ తీవ్రంగా మారుతుంది. కాబట్టి
వారు అతన్ని, “సముద్రం మాకోసం నిమ్మళించాలంటే మేము నీకేం
చేయాలి?” అని అడిగారు.

12 అందుకు అతడు, “నన్ను ఎత్తి సముద్రంలో పడేయండి,
అప్పుడు సముద్రం నిమ్మళిస్తుంది. ఈ గొప్ప తుఫాను నా కారణంగానే
మీ మీదికి వచ్చిందని నాకు తెలుసు” అన్నాడు.

13 అయితే వారు ఓడను సముద్రతీరానికి చేర్చడానికి శాయశక్తులా
ప్రయత్నించారు. కాని తుఫాను ఇంకా తీవ్రంగా విజృంభిస్తుంది కాబట్టి
వారు ఏమి చేయలేకపోయారు.

14 అప్పుడు వారు యెహోవాకు మొరపెట్టి, “యెహోవా, ఈ
మనిషి ప్రాణం కోసం దయచేసి మమ్మల్ని చావనివ్వకండి. నిర్దోషిని
చంపుతున్నామని మామీద నేరం మోపకండి, ఎందుకంటే యెహోవా,
మీ ఇష్ట ప్రకారం ఇలా జరిగిస్తున్నారు” అని చెప్పి,

15 వారు యోనాను ఎత్తి సముద్రంలో పడవేశారు, వెంటనే
పొంగుతూ ఉన్న సముద్రం నిమ్మళించింది.

16 అది చూసి వారంతా యెహోవాకు ఎంతో భయపడి, యెహోవాకు
బలి అర్పించి మ్రొక్కుబళ్ళు చేశారు.

## యోనా ప్రార్థన

17 యెహోవా యోనాను మ్రింగడానికి పెద్ద చేపను యెహోవా
నియమించారు, యోనా మూడు పగళ్ళు మూడు రాత్రులు ఆ చేప
కడుపులో ఉన్నాడు.

# 2

1 చేప కడుపులో నుండి యోనా తన దేవుడైన యెహోవాకు ప్రార్థన
చేశాడు.
2 అతడు ఇలా ప్రార్థించాడు:
“నా ఆపదలో నేను యెహోవాకు మొరపెట్టాను,
ఆయన నాకు జవాబిచ్చారు.
మృత్యులోకంలో ఉండి సహాయం కోసం అడిగాను,
మీరు నా మొర విన్నారు.
3 మీరు నన్ను అగాధంలో
సముద్ర గర్భంలో పడవేశారు.
ప్రవాహాలు నన్ను ఆవరించాయి,
మీ అలలు, తరంగాలు
నన్ను ముంచి వేశాయి.
4 ‘నేను మీ సన్నిధి నుండి
నన్ను తరిమివేసినా
మరలా నేను పరిశుద్ధ ఆలయం వైపు
తిరిగి చూస్తాను’ అనుకున్నాను.
5 ముంచివేసే నీళ్లు నన్ను భయపెట్టాయి,*
అగాధం నన్ను ఆవరించింది;
సముద్రంలో ఉన్న నాచు నా తలకు చుట్టుకుంది.
6 పర్వతాల పునాదుల వరకు నేను మునిగాను,
క్రిందున్న భూమి గడియలు నన్ను శాశ్వతంగా బంధించాయి.
అయితే నా దేవా! యెహోవా,
మీరు నా ప్రాణాన్ని గోతిలో నుండి పైకి తీసుకువచ్చారు.

* **2:5** లేదా నీళ్లు నా గొంతు వరకు ఉన్నాయి

7 “నా ప్రాణం క్షీణిస్తూ ఉంటే,
యెహోవా నేను మిమ్మల్ని జ్ఞాపకం చేసుకున్నాను.
నా ప్రార్థన మీ దగ్గరకు వచ్చింది,
మీ పరిశుద్ధ ఆలయానికి చేరింది.

8 “విలువలేని విగ్రహాలను పూజించేవారు,
తమ పట్ల దేవునికున్న ప్రేమకు దూరమవుతారు.
9 నేనైతే కృతజ్ఞత స్తుతులు చేస్తూ
మీకు బలి అర్పిస్తాను.
నేను చేసిన మ్రొక్కుబడి చెల్లిస్తాను,
‘రక్షణ యెహోవా నుండి వస్తుంది’ అని అంటాను.”
10 యెహోవా ఆ చేపకు ఆజ్ఞాపించగా అది యోనాను పొడినేల మీద
కక్కివేసింది.

# 3

## యోనా నీనెవెకు వెళ్లుట

1 తర్వాత యెహోవా వాక్కు రెండవసారి యోనాకు వచ్చింది:
2 “నీవు మహా పట్టణమైన నీనెవెకు వెళ్లి నేను నీకు ఇచ్చే సందేశాన్ని
ప్రకటించు.”
3 యోనా యెహోవా మాటకు లోబడి నీనెవెకు వెళ్లాడు; నీనెవె చాలా
పెద్ద పట్టణం కాబట్టి దానిగుండా వెళ్లడానికి మూడు రోజుల పట్టింది.
4 యోనా ఆ పట్టణంలో ఒక రోజు ప్రయాణమంత దూరం వెళ్లి,
“ఇంకా నలభై రోజులకు నీనెవె నాశనమవుతుంది” అని అంటూ
ప్రకటించాడు.
5 నీనెవె ప్రజలు దేవున్ని నమ్మి ఉపవాసం ప్రకటించారు. గొప్పవారి
నుండి సామాన్యుల వరకు అందరు గోనెపట్ట కట్టుకున్నారు.

6 యోనా హెచ్చరిక నీనెవె రాజుకు చేరినప్పుడు, అతడు తన
సింహాసనం దిగి, తన రాజ వస్త్రాలను తీసివేసి, గోనెపట్ట కట్టుకుని
బూడిదలో కూర్చున్నాడు.
7 అతడు నీనెవెలో ఈ ప్రకటన చేశాడు:

"రాజు, అతని ఘనుల శాసనం ప్రకారం:

"మనుష్యులు గాని జంతువులు పశువులు గొర్రెల మందలు
గాని దేన్ని రుచి చూడకూడదు తినకూడదు త్రాగకూడదు.
8 మనుష్యులు పశువులు గోనెపట్ట కప్పుకోవాలి. అందరు
తక్షణమే దేవున్ని వేడుకోవాలి. తమ చెడు మార్గాలను, దౌర్జన్యాన్ని
మానివేయాలి.
9 దేవుని మనస్సు మార్చుకుని కనికరంతో తన తీవ్రమైన కోపాన్ని
విడిచిపెట్టి మనం నశించకుండా చేస్తారేమో ఎవరికి తెలుసు?"

10 వారు చేసింది, వారు ఎలా తమ చెడుతనాన్ని విడిచిపెట్టారో
దేవుడు చూసి తన మనస్సు మార్చుకొని, ఆయన వారికి మీదికి
రప్పిస్తానని చెప్పిన కీడును రానివ్వలేదు.

# 4

## దేవుడు నీనెవెపై దయ చూపడంపై యోనాకు కోపం

1 అయితే యోనాకు ఇది చాల తప్పు అనిపించింది, అతనికి కోపం
వచ్చింది.
2 అతడు యెహోవాకు ప్రార్థన చేస్తూ అన్నాడు, "యెహోవా,
ఇలా జరుగుతుందని నేను నా దేశంలో ఉన్నప్పుడే చెప్పలేదా?
అందుకే నేను తర్షీషుకు పారిపోవడానికి ప్రయత్నించాను. మీరు
కృపాకనికరంగల దేవుడని, త్వరగా కోప్పడరని, మారని ప్రేమ
గలవారని, కీడు కలిగించకుండా మానివేస్తారని నాకు తెలుసు.
3 యెహోవా, బ్రతకడం కంటే నాకు చావడం మేలు, కాబట్టి నా
ప్రాణాన్ని తీసివేయండి."

4 అయితే యెహోవా జవాబిస్తూ, “నీవలా కోప్పడడం
న్యాయమేనా?” అని అన్నారు.
5 తర్వాత యోనా బయటకు వెళ్లి పట్టణానికి తూర్పుగా ఒకచోట
కూర్చున్నాడు. అక్కడ తన కోసం తాను ఒక పందిరి వేసుకొని,
పట్టణానికి ఏం జరుగుతుందో చూద్దామని దాని నీడలో కూర్చుని
ఉన్నాడు.
6 అప్పుడు యెహోవా, యోనా తలకు నీడనివ్వాలని, అతనికి
కలిగిన బాధ తగ్గించాలని ఆకులుగల ఒక చెట్టును మొలిపించారు,
యోనా ఆ చెట్టును బట్టి ఎంతో సంతోషించాడు.
7 అయితే మరుసటిరోజు ఉదయం దేవుడు ఒక పురుగును పంపగా
అది చెట్టును తినివేయడంతో ఆ చెట్టు వాడిపోయింది.
8 సూర్యుడు ఉదయించినప్పుడు, దేవుడు తూర్పు నుండి
వడగాలిని పంపించారు, యోనా తలకు ఎండదెబ్బ తగిలి అతడు
నీరసించిపోయాడు. “నేను బ్రతికి ఉండడం కంటే చావడం మేలు”
అని తనలో తాను అనుకున్నాడు.
9 అయితే దేవుడు యోనాతో, “ఆ చెట్టు గురించి నీవలా కోప్పడడం
సరైనదా?” అన్నారు.
అతడు, “అవును, సరైనదే, నాకు చావాలన్నంత కోపం వస్తుంది”
అన్నాడు.
10 అయితే యెహోవా, “నీవు ఈ చెట్టును పోషించలేదు,
పెంచలేదు. అది రాత్రికి రాత్రి మొలిచింది, రాత్రికి రాత్రి చచ్చింది.
అయినా నీవు ఈ చెట్టు విషయంలో బాధపడుతున్నావు.
11 అలాంటప్పుడు కుడి ఎడమలు తెలియని లక్ష ఇరవై వేలమంది
మనుష్యులు ఎన్నో జంతువులు ఉన్న గొప్ప పట్టణమైన నీనెవె గురించి
నేను చింతించకూడదా?” అన్నారు.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.

You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."

Notice of copyright must appear on the title or copyright page of the work as follows:

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.

"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.

You must also make your derivative work available under the same license (CC BY-SA).

If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 19 Dec 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6